


# బిచ్చగాడు

— బొజ్జపాటి రమేష్

"కాబట్టి ప్రజలంతా తమ శక్తి కొద్దీ విరాళాలిచ్చి ఆపదలో ఉన్న మన తమ్ముళ్ళు, చెల్లాయిలకు సహాయం చేయండి. మన మిచ్చేది కొంచెమే కావచ్చు. వాళ్ళ బాధల్ని పూర్తిగా తొలగించలేక పోవచ్చు. కానీ మనం వాళ్ళకు అండగా ఉన్నామనే ధైర్యం వాళ్ళ కుంటుంది. ఈ బాధితుల కిచ్చే విరాళాల వివరాలు అన్ని పత్రికల్లోనూ వేస్తారు" అని ముగించాడు సభ నిర్వాహకుడు.

బాధితుల సహాయ నిధికి విరాళాలు అందుతున్నాయి. ఇచ్చిన వాళ్ళ పేర్లు మైకులో చదువుతున్నారు. అవి విన్న వెంటనే దాతల ముఖాల్లో తాము చేసిన సహాయానికి గుర్తింపు, ప్రచారం వస్తున్నాయనే సంతృప్తి.

సభ సద్దు మణిగింది. అందరూ వెళ్ళిపోతున్నారు.

'అయ్యగారూ!' అన్న పిలుపు వినబడింది.

ఆ పిలుపు వచ్చిన వైపు చూశాడు వేదిక మీద కూర్చున్న ఒక పెద్ద మనిషి. చింపిరి బట్టలూ, మాసిన జుట్టూ చెప్పకనే చెబుతున్నాయి - ఆ పిలిచిన దొక బిచ్చగాడని.

"అడుక్కునే వెధవలు ఇక్కడ కూడా తయారయ్యారు. ఛ ఛ! అసలు వీళ్ళవల్లే దేశం దరిద్రంగా తయారవుతోంది." విసుక్కుంటున్నా డొకాయన.

"ఊ, కదులు ఇక్కణ్ణుంచి: ఇది మీకు కాదు. మేం మైకులో చెప్పామే వాళ్ళ కోసం! ఊ వెళ్ళవేం?"

బిచ్చగాడు కదలలేదు.

"ఏరా! చెబుతుంటే నీక్కాదూ?" వేదిక మీద వాళ్ళల్లో చిరాకు ఎక్కు వవుతోంది.

"అయ్యా! ఈ రూపాయ ఉంచండి". అన్నాడు బిచ్చగాడు.

"దేనికి రా?." అన్నారు విస్మయంగా.

"అదేనండి. ఆ ళ్ళెవరి కోసమో సందాలు వసూలు సేస్తున్నారు కదా. ఆళ్ళకండి"

"ఊ ఇటివ్వు!" అని విసురుగా తీసుకున్నాడు. ఇందాకటి పెద్ద మనిషి. "నువ్వు ఈ రూపాయి ఇవ్వక పోతే వాళ్ళ కొచ్చిన నష్టమేం లేదు" అని విసుక్కునాడు.

"లేదండయ్యా నా శక్తి ఇంతేనండి".

ఇంకొకాయనకి పనీ పాటా లేని అనుమానం వచ్చింది. "ఒరేయ్! ఈ రూపాయి వాళ్ళకి చేరుతుందంటావా?"

"బలేవారెనండి. మీరేదో చెప్తున్నారు కదండి"

"మేం వాళ్ళ కివ్వక పోతే ఏం చేస్తావురా?"

"మీ రిస్తారో, లేదా నేను చూశానా? అయినా మీ మీద నా కా అనుమానం రాదు. అనుమానం వచ్చింద నుకోండి. అడిగారు కాబట్టి చెబుతున్నాను- మీరు కూడా నాలాంటి బిచ్చగాళ్ళనుకుంటాను. ఉంటాను, బాబూ! దణ్ణాలు!" అంటూ అవాక్కయి పోయిన ఆ పెద్ద మనుషులు తేరుకోకముందే, అవతలికి వెళ్ళిపోయా డా బిచ్చగాడు. ★